క్లుప్తంగా

బాణసంచాకు అనుమతులు తప్పనిసరి



ఎల్.శ్రీనునాయక్

ఆలమూరు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బాణసంచా తయారీ చేసే కేంద్రాల నిర్వాహకులు విక్రయాలు జరిపే దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణకు బాణాసంచా నిల్వ చేసే గోదాములు, దుకాణాల్లో తీసుకోవలసిన నియమావళిని వివరించారు. జనావాసాలకు దూరంగా బాణసంచా విక్రయ దుకాణాల మధ్య నిర్దిష్ట దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బాణసంచా తయారీ, విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి విక్రయించాలన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో అనుమతి లేకుండా బాణసంచా తయారుచేసినా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేయరాదన్నారు. బాణసంచా విక్రయదారులు తప్పకుండా ప్రభుత్వ నిభందనలు పాటిస్తూ, అనుమతి తీసుకోవాలని సూచించారు. దీపావళి రోజున ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పండగను జరుపుకోవాలని ఎస్సై హరికోటి శాస్త్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ధర్మ ప్రచార వారోత్సవాల్లో ఎమ్మెల్యే దంపతులు



చింతలమోరిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాపాక దంపతులు

మలికిపురం: దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ధార్మిక పరిషత్ నిర్వహిస్తున్న హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలు రాజోలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మలికిపురం మండలం చింతలమోరి రామాలయం వద్ద స్వామికి అభిషేకం, సహస్ర నామార్చన వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దంపతులు, ఆయన తయుడు రాపాక వెంకట్రామ్ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



కొత్తపేటలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

కొత్తపేట: ప్రజలలో మూఢనమ్మకాలు రూపుమాపి శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా, మండల శాఖలు కృషి చేయాలని రాష్ట్ర శాఖ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కేబీ జూనియర్ కళాశాలలో జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, రాష్ట్ర ప్యాట్రన్ డాక్టర్ సీహెచ్ రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్టాలిన్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయిలో చెకుముకి పరీక్ష నిర్వహించి, విద్యార్థులు అందరూ పాల్గొనేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజామొహిద్దీన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.విజయ కృష్ణ, జిల్లా కార్యదర్శి వై.మురళి, సభ్యులు కేవీ రమణ, కె.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రేషన్ పొడిగింపుపై హర్షం

కొత్తపేట: పేదలకు అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం మరో ఐదేళ్లు పొడిగించడం హర్షణీయమని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ ఉచిత బియ్యం పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగిస్తున్నట్టు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారన్నారు. 2020లో ప్రజలు కరోనా కష్టకాలంలో ఉండగా ఈ ఉచిత బియ్యం పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందేనన్నారు. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఈ ఉచిత బియ్యం అందజేయడం ద్వారా ప్రతి సంవత్సరం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి

- ఆర్డీవో ముక్కంటి
- పలు చోట్ల ప్రత్యేక క్యాంపులు



ఆలమూరులోని పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో ముక్కంటి



అంబాజీపేటలో బీఎల్వోలను వివరాలు అడుగుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణారెడ్డి



రాజోలులో కొత్త ఓట్ల నమోదు దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ముక్తేశ్వరరావు



నగరంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఈఆర్వో రమణారెడ్డి

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విడుదల చేసిన ఓటరు జాబితాను పరిశీలించుకుని తమ ఓటును నిర్ధారించుకునేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తుందని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన ఆదివారం మండల అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ ఐపీ శెట్టితో కలిసి పర్యటించి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ ఆఫీసర్లు ఏర్పాటు చేసిన ఓటర్ జాబితా సవరణలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర మార్పులు ఉంటే సవరణకు అవకాశం ఉందన్నారు. అలాగే ఓటు గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులు స్థానికంగా యేళ్ల తరబడి నివాసం లేకుంటే సంబంధిత ఓటరును జాబితా నుంచి తొలగిస్తామన్నారు. ఓటర్ జాబితాలో పేర్లు లేనిచో డిసెంబర్ తొమ్మిది లోపు స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్ల వద్ద నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అంబాజీపేట, నందంపూడి గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. కోశివారి అగ్రహారం, ఇటికాలమ్మ గుడి, జెడ్పీ హైస్కూల్, నందంపూడిలో ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్వోల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని పేర్ల సవరణ, చేర్పులు, మార్పులు అన్ని దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ టి.మంగతాయారు, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో రమణ, బీఎల్వో ఉన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం ఎన్నికల స్పెషల్ క్యాంపులు నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ, పేరు మార్పు, చేర్పులు, అడ్రసు మార్పు వంటి వాటితో చనిపోయిన వారి పేర్ల తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మంగతాయారు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గ పరిధిలోని మామిడికుదురు, ఈదరాడ, కొమరాడ గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను డీఆర్‌డీఏ పీడీ, రాజోలు నియోజకవర్గ ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి వి.శివశంకర్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఓటర్ల నమోదు, సవరణలు, మృతుల ఓట్ల తొలగింపు తదితర అంశాలపై ఉద్యోగులకు తగిన సూచనలు చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు వచ్చే నెల 9వ తేదీ వరకు సమయం ఉందని, అర్హత కలిగిన వారు తగిన వివరాలతో ఓటును నమోదు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ అలీ, వీఆర్వోలు ఉన్నారు.

నగరంలో..

పి.గన్నవరం నియోజకవర్గం ఈఆర్వో, జిల్లా పరిషత్ సీఈఓ ఎ.రమణారెడ్డి ఆదివారం నగరం, పాశర్లపూడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న విజ్ఞాపనలు, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, వీఆర్వోలు ఉన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూలపాలెం ఎంపీపీ స్కూల్ వద్ద బీఎల్వో కె.శ్రీప్రియ ఆధ్వర్యంలో 211 బూత్‌లో ఓటరు పరిశీలన స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గం కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వచ్చి తమ ఓటును పరిశీలించుకోవాలని అన్నారు. ఓటు లేనిచో వెంటనే తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కుడుపూడి చంద్ర శేఖర్, ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీనివాస్, బూత్ కన్వీనర్ రాజేష్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: కొత్త ఓట్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక శిబిరాలను నిర్వహించిందని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల పాటు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు కొత్త ఓటర్లు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఆలమూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: నాలుగు దశాబ్దాల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఒక వేదికపై చేరుకున్నారు. ఆప్యాయతను కురిపిస్తూ ఆలింగనం చేసుకుంటూ నాటి అనుభవాలను పంచుకున్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979–80లో చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం చోటుచేసుకుంది. పూర్వ విద్యార్థులు ఒకచోట చేర్చాలని ఆలోచనలో భాగంగా మిత్రులు కామవరపు మల్లికార్జునరావు, వెత్సా జవహర్‌లాల్ నెహ్రూ, గెద్దాడ రవీంద్రనాథ్, బొబ్బా ఆదినారాయణతో పాటు పలువురు పూర్వ విద్యార్థుల సహకారాన్ని తీసుకుని వివిధ ప్రాంతాలలో ఉద్యోగ, వ్యాపారంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఒక చోట చేర్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.1.5 లక్షలను విరాళాలుగా సేకరించి సమీప వాణిజ్య బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు నిర్ణయించారు. దాని ద్వారా వచ్చే వడ్డీని యేటా నవంబర్ 14న నిర్వహించే బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలని తీర్మానించారు. ఆ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేయాలని పాఠశాల యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

వాడపల్లి ఆలయ అభివృద్ధికి కృషి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకుని సతీ సమేతంగా శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ, అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వాడపల్లి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయన్నారు. ఆదివారం కల్యాణం జరిగిందని, స్వామి వారి కల్యాణంలో పాల్గొనే అవకాశం నాకు రావడం చాలా అదృష్టమన్నారు. కార్యక్రమాన్ని చైర్మన్, ఈఓలతో పాటు భక్తుల సహకారంతో ఘనంగా జరుగుతున్నాయన్నారు. సీఎం జగన్‌తో పాటు భక్తులు ఇచ్చే విరాళాలతో ఆలయం మరో తిరుపతిగా భాసిల్లుతుందన్నారు. రాబోయే కాలంలో కూడా బ్రహ్మోత్సవాలను మరింత అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. భక్తుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, చిలువూరి బాబిరాజు, సర్పంచ్‌లు పోచిరాజు బాబు రావు, పాల నాగేశ్వరరావు, గాదిరాజు రామకృష్ణంరాజు, ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎనభై వసంతాల సాహితీ శిఖరం కవి సుబ్బారావు



కొత్తపేటలో కవి సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న కళాసాహితీ సభ్యులు, కవులు, రిటైర్డ్ అధికారులు

కొత్తపేట: కవిగా, రచయితగా, వందలాది సాహితీ సభలు నిర్వహించిన సుబ్బారావు 80 వసంతాల సాహితీ శిఖరం అని ప్రముఖ విన్నపాల కవి, రచయిత మోకా రత్నరాజు అన్నారు. కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత, స్థానిక కళాసాహితీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ గిడ్డి సుబ్బారావు 80వ పుట్టినరోజును ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బంధుమిత్రుల సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుబ్బారావు స్వగృహ ప్రాంగణం ×కవితా విపంచి×లో జరిగిన సభకు కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవశరాజు అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, విన్నపాల కవి మోకా రత్నరాజు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ సూపరింటెండెంట్ దువ్వ తిరుపతిరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభలో కవి రత్నరాజు మాట్లాడుతూ సుబ్బారావు ఇల్లు కవితా విపంచి ప్రాంగణంలో ఈ ఇంటి అరుగే వేదికగా సాహితీ సమావేశాలు జరిగాయన్నారు. కళాసాహితీ అధ్యక్షుడు హరిహరదేవశరాజు మాట్లాడుతూ సుబ్బారావు సాహితీ సేవలు ఉన్నతమైనవని అన్నారు. కోశాధికారి షేక్ గౌస్ మాట్లాడుతూ సుబ్బారావు సేవలను ఆ రంగం చిరకాలం గుర్తించుకుంటుందన్నారు. అనంతరం సుబ్బారావు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, కళాసాహితీ సభ్యులు, కవులు కేకులు ఏర్పాటు చేసి ఆయనతో కట్ చేయించారు. సుబ్బారావు–సుశీల దంపతులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలు, మెమెంటోలతో సత్కరించారు. తన 80 వసంతాల వేడుకకు విచ్చేసిన వారందరికీ సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈఎస్ గూడపాటి కుటుంబరావు, కళాసాహితీ కోశాధికారి షేక్ గౌస్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ వెలక్కాయల సత్యనారాయణ, వివిధ ప్రాంతాల కవులు డాక్టర్ గూటం స్వామి, పిట్టా సుబ్రహ్మణ్యం, మిరప మహేష్, సీహెచ్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సభ్యులతో ఎన్జీవో అసోసియేషన్ బలోపేతం



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎన్జీవో అధ్యక్షుడు రామారావు

కొత్తపేట: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కొత్తపేట తాలూకా యూనిట్‌ను కొత్త సభ్యులతో బలోపేతం చేయాలని యూనిట్ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఆదివారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో తాలూకా యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు అధ్యక్షతన జరిగింది. రామారావు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సభ్యులుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులను చేర్చుకోవాలని, ఎన్జీవో సమాచారం మాసపత్రిక నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొనుగోలు చేసే విధంగా కార్యవర్గ సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఏపీఎన్జీవో కృషిని తాలూకాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహించి వివరణాత్మక విశ్లేషణ ద్వారా వివరించాలన్నారు. ఇలా వివిధ అంశాలపై చర్చించి తీర్మానించారు. సమావేశంలో తాలూకా యూనిట్ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, యూనిట్ కార్యదర్శి నల్లా వెంకటరామారావు (బాబి), ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి శామ్యూల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నుంచి ఉపశమనం



అమలాపురంలో కుమ్మరి కాలువపై నిర్మించిన వంతెనకు లోడ్ టెస్టింగ్ చేస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

- కుమ్మరి కాలువపై రూ.1.02 కోట్లతో వంతెన నిర్మాణం
- మూడు రోజుల పాటు చేపట్టిన లోడ్ టెస్టింగ్ విజయవంతం
- పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డుకు వెళ్లనున్న వాహనాలు

అమలాపురం టౌన్: ట్రాఫిక్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అమలాపురం పట్టణ ప్రజలకు ఉపశమనం లభించింది. ఈదరపల్లి వంతెన నుంచి నల్ల వంతెన మీదుగా ఎర్ర వంతెన వరకూ ఉన్న బైపాస్ రోడ్డు కొంత ట్రాఫిక్ భారం తీరుస్తోంది. ఇప్పుడు నల్ల వంతెన సమీపంలో శ్మశానం మీదుగా ప్రవహించే కుమ్మరి కాలువ(డ్రెయిన్)పై ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) నిధులు రూ.1.02 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ నిర్మించిన వంతెన వల్ల ట్రాఫిక్ సమస్యకు మరింత ఉపశమనం లభించనుంది.

నిర్మాణం పూర్తయిన ఈ వంతెన అధికారికంగా కొద్దిరోజుల్లోనే అందుబాటులోకి రానుంది. దీనివల్ల వాహనాలు అమలాపురం పట్టణంలోకి వెళ్లే పని లేకుండా నల్ల వంతెన పక్క నుంచి పంట కాలువ వెంబడి వేసిన రోడ్డు, కొత్తగా నిర్మించిన వంతెన మీదుగా నడిపూడి లాకుల వద్ద ఈదరపల్లి–ముక్కామల బైపాస్ రోడ్డుపైకి వెళ్లే వెసులుబాటు కలుగుతోంది. దీంతో విజయవాడ, రాజమహేంద్రవరం వెళ్లే భారీ వాహనాలతో పాటు కార్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలు పట్టణ ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా నేరుగా ఈ కొత్త వంతెన మీదుగా బైపాస్‌లోకి వెళ్లి సమయం, దూరం ఆదా కానుంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో నిర్మించిన ఈ వంతెన పనులను అమలాపురం పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ సంయుక్త కృషితో వంతెన నిర్మాణం సాకారమైంది.

విజయవంతమైన లోడ్ టెస్టింగ్

వంతెన నిర్మాణం పూర్తయ్యాక గత మూడు రోజులుగా పంచాయతీరాజ్ జిల్లా అధికారి(ఎస్ఈ) కె.చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబుల ఆధ్వర్యంలో జరిగిన లోడ్ టెస్టింగ్ విజయవంతమైంది. 126 టన్నుల సామర్థ్యంతో నిర్మించిన ఈ వంతెనపై గత మూడు రోజులుగా 24 గంటలూ లోడ్ టెస్టింగ్ నిర్వహించారు. మూడుదశల్లో అంటే డిఫ్లెక్షన్, టోటల్ స్టేషన్స్, కెపాసిటీ బిల్డప్‌ల పరీక్షలు నిర్వహించారు. లోడ్ టెస్టింగ్ ప్రక్రియ శనివారం రాత్రితో ముగిసి విజయవంతం కావడంతో పంచాయతీరాజ్ ఇంజినీర్ల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

భారీ వర్షంతో రోడ్లు జలమయం



పి.గన్నవరంలో కురిసిన వర్షం

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. స్థానిక ఏజీ రోడ్డు వర్షం నీట మునగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పి.గన్నవరం నుంచి అంబాజీపేట వరకూ రోడ్డు ధ్వంసమైంది. ముంగండ వరకూ వర్షం నీటితో గుంతలు మునగడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

భారీగా అన్నసమారాధన

అంబాజీపేట: గ్రామ శివారు కొత్తపాలెంలో వేంచేసిన సీతారామాలయం వద్ద స్థానిక హంస వాహన కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవంలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ భేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని భక్తులు, స్థానికులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, 13 పాలాల యువకులు, పెద్దల సహకారంతో ఘనంగా నిర్వహించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి



విఘ్నేశ్వరుని దర్శించుకుంటున్న రాజీవ్ దంపతులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని రాజమహేంద్రవరం మొదటి అదనపు జిల్లా జడ్జి పీఆర్ రాజీవ్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన్ను స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ప్రధాన రహదారిని అభివృద్ధి చేయండి



ఇసుకపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా ఉంది. దానిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారిలో గుంతలు ఏర్పడి నడిచేందుకు వీలు లేకుండా ప్రమాద భరితంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో అటుగా వెళ్లే పాఠశాల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో ద్విచక్ర, సైక్లిస్టులు ప్రయాణించి ప్రమాదాల బారిన పడ్డారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మామిడికుదురులో గురువు ఉమామహేశ్వరరావు యోగాసనాల ప్రదర్శన

మామిడికుదురు: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రముఖ యోగా గురువు ఆకుల ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మామిడికుదురు ఖేతస్ యోగా కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో యోగా గురువు ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు విద్యార్థులు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. యోగాసనాలతో పాటు విద్యార్థులు కూచిపూడి నృత్యం కూడా చేశారు. కార్యక్రమంలో మ్యూజిక్ థెరపీ, వైద్య నిపుణులు గురు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, ఆకుల లక్ష్మీనారాయణ, పార్వతి, జాలెం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక శివారు ఉండ్రాజవరపు వారిపేటకు చెందిన కె.సన్నీ అనే వ్యక్తి ఇటీవల మరణించగా, అతని కుటుంబానికి జనసేన పార్టీ సేవకుడు గిడ్డి సత్యనారాయణ ఆదివారం రూ.10 వేల సాయం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ పాలూరి వీరభద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం శివారు బూరుగు గుంటలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నేతల ఓమ్‌రావుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. పొయ్యి నుంచి ఎగసిన నిప్పు రవ్వల కారణంగా ఈ ప్రమాదం జరిగింది. ఇంట్లో నివసిస్తున్న నాలుగు కుటుంబాల వారు నిరాశ్రయులు కావడంతో రెవెన్యూ అధికారులు ఆదివారం 10 కిలోల వంతున బియ్యం పంపిణీ చేశారు.